# తిరగబడిన కథ

"హలో...."

"యస్...."

"మల్లాది వెంకటకృష్ణమూర్తిగారేనా?"

"ఆఁ మల్లాదినే"

"నాకథ ఎలా ఉంది?"

"మీ కథా? ఏ కథ?"

"తిరగబడిన కథ?"

"ఎప్పుడు తిరగబడింది.... ఎలా తిరగబడింది?"

"మా గొప్పగా జోకేశార్లేగాని చెప్పండిసార్ ఎలా ఉంది?"

"ఏమిటి ఎలా ఉండటం?"

"నా కథ.... మై స్టోరీ టైటిల్డ్ తిరగబడిన కథ...."

"ఓ....ఐసీ.... ఎప్పుడు పంపారు మీరా కథని?"

"రెండు వారాలయ్యింది. ఈ పాటికి మీరు దాన్ని పరిశీలించే ఉంటారనుకుంటా...."

"రెండు వారాల క్రితందైతే పరిశీలించే ఉంటాను...."

"మరైతే ఇహనేం.... చెప్పండి.... ఎలా ఉంది?"

"ఐయామ్ సారీ.... ఎలా ఉందో నాకైతే సరిగ్గా గుర్తులేదుగాని దాన్ని చెత్తబుట్టలో వేసినట్టుగా మాత్రం బాగా గుర్తుంది...."

"చెత్త బుట్టలో పడేశారా.... ఏం.... ఎందుకని?"

"బావులేదు గనుక...."

"బావులేదా....ఏం.... ఎందుకు బావులేదు?"

"ఒక రచన బావుండటానికి బావుండకపోవడానికి సవాలక్ష కారణాలుంటాయ్...."

"సవాలక్షొద్దు.... ఒక్కటి చెప్పండి చాలు"

"ఇతివృత్తం పరమ చెత్తగా ఉంది...."

"ఇంకా?"

"శైలికూడా చాలా అధ్వాన్నంగా ఉంది.."

"ఇంకా?"

"శిల్పం కూడా బావులేదు."

"మొత్తంమీద నా కథ పరమ బేవార్స్‌గా ఉందంటారు....అ తే?"

"అంత ఘోరమైన పదమెందుకు లెండి.... మొత్తానికి మీకథ నా టేస్ట్‌కి సూట్‌కాలేదు. మీరు సెల్ఫ్ అడ్రెస్డ్ కవరు పెట్టలేదు కాబట్టి చెత్తబుట్టలో పడేయాల్సొచ్చింది. దట్సాల్"

"ఇఫ్ యు డోంట్ మైండ్.... చెత్తబుట్టలోంచి ఆ కథని బైటకితీసి మళ్ళీ ఒకసారి చదవగలరా?"

"ఇంపాజిబుల్!"

"వై?"



"చెత్త బుట్టలోపడిన సరుకుని ఏరోజుది ఆ రోజే కాల్చి పారేస్తుంటాం"

"ఐతే మీకథని అగ్నికి ఆహుతి చేసేశారన్నమాట!"

"నా కథా?!!"

"అవును సార్. మీ కథే పదేళ్ళ క్రితం 'తెలుగు దీపం' లో పడిన మీ కథని "తిరగబడిన కథ" గా పేరు మార్చి మళ్ళీ మీకే పంపించాను. ఇవ్వాళ మీరు ఎడిటర్ అయినంత మాత్రాన ఒకప్పటి మీకథ మీకే నచ్చలేదంటే.. దాన్ని చెత్తబుట్టకి ఆహారంగా పడేశారంటే.... నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది"

—అవతల్నుంచి ఫోన్ పెట్టేసిన చప్పుడు!

బుర్ర గిర్రున తిరిగిపోయింది మల్లాదివెంకటకృష్ణమూర్తికి.

* * *

"ట్రింగ్....ట్రింగ్...."

అంతలో మళ్ళీ ఫోన్ మ్రోగింది

"యస్ .."

"హలో నేనేసార్"

"మళ్ళీ ఎందుకు ఫోన్‌చేశారు? చెప్పానుగా మీకథని చెత్తబుట్ట మింగేసిందని"

"ఏ కథని సార్?"

"మీ కథని.... మీ తిరగబడిన కథని.... మీరు కాపీకొట్టి పంపించిన నా కథని...."

"మీ కథని నేను కాపీ కొట్టడం ఏమిటిసార్? నేనసలు మీ పత్రిక్కి ఏకథా పంపించలేదు...."

"వ్వాట్?"

"అవును సార్! మీ పత్రిక్కి నేను ఏకథా పంపించలేదు.... యునో.... మీతో సరదాజోక్ చేసానంతే. ప్లీజ్ డోంట్ గెట్ అఫెండెడ్ సార్! 'టేకి'ట్ ఈజీ."

చిరుకోపం వచ్చినా చిరునవ్వు విరిసింది 'స్రవంతి' పత్రికా సంపాదకుడు మల్లాది వెంకటకృష్ణమూర్తి పెదవులపై.

"ఇట్సాల్‌రైట్.... ఇంతకీ మీపేరేంటో చెప్పారు కాదు...."

"ఐ.యం. కిషన్....కార్టూనిస్ట్ ఫ్రమ్ గుర్రాలరావ్ పేట...."

**-యం.ఐ. కిషన్**

-అశ్వారావుపేట-507301
ఖమ్మం (జిల్లా)